తెలంగాణ సాగుకు సంక్రాంతి శోభ

వ్యవసాయానికి, రైతు సంక్షేమానికి పెద్దపీట వేసిన ఘనత బీఆర్ఎస్‌దే • రాష్ట్రప్రజలకు కేసీఆర్ సంక్రాంతి శుభాకాంక్షలు

హైదరాబాద్, జనవరి 13 (నమస్తే తెలంగాణ): రైతు పండుగ సంక్రాంతి పర్వదినం సందర్భంగా రాష్ట్ర ప్రజలకు బీఆర్ఎస్ అధినేత కే చంద్రశేఖర్ రావు శుభాకాంక్షలు తెలియజేశారు. భోగితో ప్రారంభమై మకర సంక్రాంతి, కనుమతో మూడు రోజుల పాటుసాగే సంక్రాంతి పండుగ, వ్యవసాయాధారిత పల్లె సంస్కృతిలో ప్రత్యేకతను చాటుకుంటుందని పేర్కొన్నారు. పండిన పంటల రాశులతో ఇండ్లు కళకళలాడుతూ, రైతుల జీవితాల్లో సంక్రాంతి శోభ నిండుదనాన్ని సంతరించుకుంటుందని తెలిపారు. రంగవల్లులు, గొబ్బెమ్మలతో పిల్లలు, పెద్దలు గుమిగూడి ఆనందోత్సాహాల నడుమ జరుపుకునే ప్రకృతి పండుగ మకర సంక్రాంతి అని వివరించారు. నూతన తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయం పండుగ కావాలని, పాడిపంటలతో రైతు కుటుంబాల్లో సంతోషం వెల్లివిరియాలన్న దృఢ సంకల్పంతో నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక పథకాలను ప్రారంభించిందని గుర్తుచేశారు. వ్యవసాయం, దాని అనుబంధ రంగాల అభివృద్ధి, రైతు సంక్షేమమే తొలి ప్రాధాన్య అంశంగా నాడు అమలుచేసిన కార్యాచరణ, పదేండ్ల అనతికాలంలోనే సత్ఫలితాలనిచ్చిందని వివరించారు. 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్తు, ప్రాజెక్టులు, కాల్వల ద్వారా సాగునీరు, పంటకు పెట్టుబడి సాయంగా రైతుబంధు, రైతు కుటుంబానికి భరోసాగా రైతుబీమా వంటి పలు పథకాలను పటిష్ఠంగా అమలుచేశామని గుర్తుచేశారు. తద్వారా సాధించిన వ్యవసాయ ప్రగతి ప్రపంచవ్యాప్తంగా పలు ప్రశంసలు అందుకున్నదని, దేశానికే ఆదర్శంగా తెలంగాణను నిలిపిందని పేర్కొన్నారు.

దండుగన్న సాగును పండుగ చేసింది బీఆర్ఎస్

వ్యవసాయానికి దన్నుగా, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచిన కులవృత్తులకు మునుపెన్నడూలేని విధంగా బీఆర్ఎస్ ప్రభుత్వం అందించిన ప్రోత్సాహం, ఆర్థిక సహకారం, సబ్బండ కులాల జీవితాల్లో సంక్రాంతి శోభను నింపిందని కేసీఆర్ తెలిపారు. పదేండ్ల బీఆర్ఎస్ ప్రభుత్వం దాదాపు నాలుగున్నర లక్షల కోట్ల రూపాయల నిధులను వ్యవసాయరంగ అభివృద్ధి కోసం ఖర్చు చేసిందని వివరించారు. ఎవరెన్ని విమర్శలు చేసినా రైతు జీవితాల్లో వెలుగులు నింపాలనే దృఢ సంకల్పంతో ముందుకు సాగామని, ఆ పట్టుదలతోనే తెలంగాణ వ్యవసాయంలో ప్రగతి సాధ్యమైందని పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఒకనాడు దండుగన్న తెలంగాణ వ్యవసాయం బీఆర్ఎస్ హయాంలో సంక్రాంతి పండుగలా మారిందని కేసీఆర్ పునరుద్ఘాటించారు. రాజకీయాలకు అతీతంగా రైతన్న సంక్షేమమే ధ్యేయంగా, రాజీపడకుండా పదేండ్ల ప్రగతి ప్రస్థానాన్ని నేటి ప్రభుత్వం కొనసాగించాలని కేసీఆర్ సూచించారు. తద్వారా సాధించే ప్రగతి ద్వారా మాత్రమే రైతు పండుగ సంక్రాంతి వేడుకలకు వన్నె చేకూర్చినవారమవుతామని తెలిపారు. రైతన్న జీవితాల్లో వెలుగులు కొనసాగేలా దీవించాలని ప్రకృతి మాతను కేసీఆర్ ప్రార్థించారు.

లోకం పోకడ

కౌశిక్‌రెడ్డి అరెస్టు

మొదటిపేజీ తరువాయి...

పోలీసులు.. ఒక్కసారిగా ఆయన్ను చుట్టుముట్టారు. ఒక వ్యక్తికి సెల్ఫీ ఇస్తున్న సమయంలో దాదాపు నలభై మంది పోలీసులు రౌండప్ చేసి కారణాలు చెప్పకుండానే అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల అరెస్టును కౌశిక్‌రెడ్డి ప్రతిఘటించగా, బలవంతంగా కారులో ఎక్కించారు. ఎందుకు అరెస్టు చేస్తున్నారో చెప్పండి అంటూ నిలదీయడంతో 'కరీంనగర్‌లో నమోదైన కేసు గురించి' అంటూ అదుపులోకి తీసుకున్నారు. 'నేను వస్తాను.. ఎందుకు నెడుతున్నారు? నెట్టకు భయ్యా' అని పాడి కౌశిక్‌రెడ్డి చెప్తున్నా వినిపించుకోకుండా బలవంతంగా పోలీసు వాహనంలోకి ఎక్కించారు. అరెస్టుకు సంబంధించిన వారెంట్, కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వకుండానే కౌశిక్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది.

కౌశిక్‌రెడ్డే టార్గెట్‌గా?

కౌశిక్‌రెడ్డి వివిధ వేదికలపై నిత్యం ప్రజా సమస్యలను ప్రస్తావిస్తూ ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెడుతున్నారు. దీంతో ప్రభుత్వం ఆయన్ను టార్గెట్ చేస్తున్నదనే ఆరోపణలున్నాయి. గతంలో దళితబంధు విషయంలో హుజూరాబాద్‌లో జరిగిన ఆందోళనలో పాల్గొన్న కౌశిక్‌రెడ్డిపై పోలీసులు దాష్టీకం ప్రదర్శించిన తీరు వివాదాస్పదమైంది. పోలీసులు పిడిగుద్దులు గుద్దడంతో ఆయన సొమ్మసిల్లి పడిపోయారు. బీఆర్ఎస్ హయాంలో మంజూరుచేసిన దళితబంధు రెండో విడత ఆర్థిక సహాయాన్ని విడుదల చేయాలన్నందుకు ప్రభుత్వం ఈ విధంగా వ్యవహరించిందనే విమర్శలు అప్పట్లోనే వచ్చాయి. అంతకుముందు జడ్పీ సమావేశంలో కూడా ప్రజా సమస్యలపై ప్రశ్నించినందుకు ఆయనపై అధికారుల విధులకు ఆటంకం కలిగించారంటూ పలు కేసులు నమోదు చేశారు. తాజాగా ఆదివారం కరీంనగర్ కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో.. బీఆర్ఎస్ బీఫారంపై గెలిచి, కాంగ్రెస్‌లో చేరిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్‌ను నిలదీసిందుకు.. ఆయనపై కక్షకట్టిన మంత్రుల ఆదేశాల మేరకే పోలీసులు అరెస్టు చేశారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సంక్రాంతి పండుగ సందర్భంగా కోర్టులకు సెలవులు ఉన్న నేపథ్యంలో బెయిల్ రాకుండా చేయొచ్చన్న వ్యూహంలో భాగంగానే కౌశిక్‌రెడ్డిని కుట్రపూరితంగా నిర్బంధంలోకి తీసుకున్నారనే ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. వాస్తవానికి కౌశిక్‌రెడ్డికి 35 ఏ సెక్షన్ కింద నోటీసులు ఇస్తే సరిపోయేదానికి అరెస్టు చేయడం.. బీఆర్ఎస్ నేతలను కుట్రపూరితంగా టార్గెట్ చేయడమేననే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. ఏడేండ్ల కంటే తక్కువగా శిక్ష పడే కేసుల్లో అరెస్టు చేయొద్దని న్యాయనిపుణులు పేర్కొంటున్నారు.

ఒకే సంఘటనపై ముగ్గురు ఫిర్యాదు

ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ వ్యక్తిగత పీఏ కాట్రోజు వినోద్ చేసిన ఫిర్యాదు మేరకు కరీంనగర్-1 టౌన్ పోలీసులు భారత శిక్షాస్మృతిలోని 2023 సెక్షన్ 132, 115(2), 352, 292 కింద ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై కేసులు నమోదు చేశారు. అలాగే సమావేశంలో గందరగోళం సృష్టించి సభను తప్పుదారి పట్టించారని కరీంనగర్ ఆర్డీవో మహేశ్వర్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా మరో కేసు నమోదుచేశారు. కరీంనగర్ గ్రంథాలయం చైర్మన్ మల్లేశం ఇచ్చిన ఫిర్యాదు మేరకు భారత శిక్షాస్మృతిలోని 126(2), 115(2), 352, 292 సెక్షన్ల కింద మరో కేసు నమోదు చేశారు. వీటిని పరిగణనలోకి తీసుకొని కౌశిక్‌రెడ్డిని హైదరాబాద్‌లో అరెస్టు చేశారు.

కలెక్టరేట్‌లో నిలదీసిన కౌశిక్

పాడి కౌశిక్‌రెడ్డి అరెస్టు వ్యవహారంలో అసలేం జరిగిందనేది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా అమల్లోకి తెస్తున్న నాలుగు పథకాలపై కరీంనగర్ కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌తోపాటు ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు హాజరయ్యారు. ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, డాక్టర్ సంజయ్‌కుమార్ పక్కపక్కనే కూర్చున్నారు. సంజయ్ కంటే ముందు కౌశిక్‌రెడ్డిని మాట్లాడాల్సిందిగా అధికారులు కోరారు. ఈ సందర్భంగా కొత్తగా అమల్లోకి తెస్తున్న నాలుగు పథకాల్లో ఉన్న లోపాలను కౌశిక్‌రెడ్డి ఎత్తిచూపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. రైతు భరోసా కింద రూ.15 వేలు ఇస్తామని, ఇప్పుడు రూ.12 వేలు మాత్రమే ఇస్తామంటున్నారని, రైతులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. ప్రధానంగా నియోజకవర్గ అభివృద్ధికి ఇస్తున్న ఎస్‌డీఎఫ్ నిధులను ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ఉన్నచోట కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీలకు కేటాయిస్తున్నారని, తన నియోజకవర్గానికి కేటాయించిన రూ.10 కోట్ల నిధులను తన చేతిలో ఓడిపోయి మూడోస్థానంలో నిలిచిన వ్యక్తి పేరిట ఇవ్వడం ఎంత వరకు సమంజసమని మంత్రులను నిలదీశారు. అభివృద్ధి పనులకు పైసలు కాంగ్రెస్ పార్టీ ఇస్తున్నదా? ప్రభుత్వం ఇస్తున్నదా? అని ప్రశ్నించడంతో మంత్రుల నుంచి ఎలాంటి జవాబు రాలేదు. దళిత బంధు, ఇందిరమ్మ ఇండ్ల పథకాల గురించి ప్రస్తావించిన కౌశిక్‌రెడ్డి.. ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించి కూర్చున్నారు. ఈ సందర్భంలో తన పక్కనే కూర్చున్న డాక్టర్ సంజయ్ తనను రెచ్చగొట్టేలా వ్యాఖ్యానిస్తున్నారని, ఆయనకు మైక్ ఇవ్వవద్దని, ఆయనది ఏ పార్టీ? అంటూ వేదికపై ఉన్న మంత్రులను ప్రశ్నించారు. సంజయ్ కాంగ్రెస్‌లో ఉన్నారా? బీఆర్ఎస్‌లో ఉన్నారా? అని నిలదీశారు. దీంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఒకరినొకరు దూషించుకున్నారు. ఇద్దరి మధ్య గొడవ జరుగుతుండగా రంగంలోకి దిగిన పోలీసులు కౌశిక్‌రెడ్డిని కలెక్టరేట్ ఆడిటోరియం నుంచి ఈడ్చుకొని బయటకు తీసుకెళ్లారు. మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పోలీసులకు సర్దిచెప్పి అక్కడినుంచి కౌశిక్‌రెడ్డిని తీసుకుని వెళ్లిపోయారు.

సోమవారం రాత్రి కరీంనగర్ త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

కౌశిక్‌రెడ్డి రిమాండ్‌పై జాప్యం

కరీంనగర్ పోలీసులు సోమవారం సాయంత్రం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని అరెస్ట్ చేసి రాత్రి 9.30 గంటల సమయంలో కరీంనగర్‌లోని పోలీసు శిక్షణ కేంద్రానికి తీసుకొచ్చారు. అక్కడి నుంచి త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అర్ధరాత్రి దాటిన తరువాత లేదా మంగళవారం ఉదయం మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచి రిమాండ్‌కు తరలించే అవకాశం ఉన్నది.

రెండు రోజులుగా హైడ్రామా

ఉమ్మడి కరీంనగర్ జిల్లా సమీక్షా సమావేశంలో ఇద్దరు ఎమ్మెల్యేల మధ్య జరిగిన వాదోపవాదాలు, పరస్పర దూషణల నేపథ్యంలో ఆదివారం నుంచి జిల్లాలో హైడ్రామా సాగుతున్నది. సమీక్ష ముగిసిన తర్వాత మీడియా అడిగిన ప్రశ్నలకు సంజయ్‌కుమార్ సమాధానం చెప్తూ.. కౌశిక్‌రెడ్డిపై కేసు పెట్టే ఉద్దేశం తనకు లేదని చెప్పారు. అదేరోజు సాయంత్రం తన పీఏతో కరీంనగర్ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లయ్య కూడా కౌశిక్‌రెడ్డిపై ఫిర్యాదు చేశారు. సమీక్షను అడ్డుకున్నారంటూ కరీంనగర్ ఆర్డీవోతోనూ పోలీసులకు ఫిర్యాదు చేయించారు. ఈ ఫిర్యాదులపై కేసులు నమోదుచేసిన పోలీసులు సోమవారం ఉదయం నుంచి కౌశిక్‌రెడ్డిని అరెస్టు చేయడానికి నిఘా పెట్టారు. ఈ నేపథ్యంలో జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్.. స్పీకర్‌ను కలిసి కౌశిక్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరినట్టు తెలుస్తున్నది. కౌశిక్‌రెడ్డిని కరీంనగర్ పోలీసులు హైదరాబాద్‌లో అరెస్టు చేయడం కలకలం రేపుతున్నది. నాటకీయ పరిణామాల మధ్య అరెస్టుల పర్వం సాగినట్టు కనిపిస్తున్నది.

హామీలపై నిలదీస్తే అరెస్టులా? : వేముల

కాంగ్రెస్ పార్టీ బూటకపు హామీలపై నిలదీస్తే అరెస్టులా? అని మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రశ్నించారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నట్టు చెప్పారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేలపై రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నదని మండిపడ్డారు.

పారిపోతున్న సర్కార్‌కు తార్కాణమే అరెస్టు : మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలను ప్రశ్నించినా రేవంత్ సర్కార్ తట్టుకోలేకుండా పోతున్నదని, ప్రజల్లో ప్రభుత్వానికి తీవ్రస్థాయిలో వస్తున్న వ్యతిరేకతను డైవర్ట్ చేసేందుకే ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి అరెస్టు అని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి నిప్పులు చెరిగారు. అసెంబ్లీ నుంచి ప్రజాక్షేత్రం దాకా ఎక్కడికక్కడ కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం చెప్పలేని దుస్థితికి వెళ్లిపోయిందని దుయ్యబట్టారు. పాడి కౌశిక్‌రెడ్డిని భేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

హేమమైన చర్య : ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అరెస్టు అత్యంత హేయమైన చర్య అని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి విమర్శించారు. బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేను తాను ఏ పార్టీ నుంచి మాట్లాడుతున్నావో చెప్పాలని అడిగితే కేసు పెడతారా? అని మండిపడ్డారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిపై బనాయించిన అక్రమ కేసులను స్పీకర్ చొరవ తీసుకొని న్యాయ పరంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

రాజ్యాంగానికి రేవంత్ సర్కార్ తూట్లు : ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

పార్టీ ఫిరాయింపులను ప్రశ్నిస్తే అరెస్టు చేస్తారా అని ఎమ్మెల్సీ కవిత నిలదీశారు. రాజ్యాంగ విలువలకు, ప్రజాస్వామిక స్ఫూర్తికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తూట్లు పొడుస్తున్నారని మండిపడ్డారు. ఏడో గ్యారెంటీగా ప్రజాస్వామ్యాన్ని కాపాడుతామని ఊదరగొట్టిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పుడు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఇలాంటి అక్రమ నిర్బంధాలకు భయపడే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. అక్రమ అరెస్టులతో బీఆర్ఎస్ కార్యకర్తలను, నాయకులను భయపెట్టలేరని స్పష్టంచేశారు. ఎన్ని ఇబ్బందులు పెట్టినా ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్‌ను నిలదీస్తూనే ఉంటామని స్పష్టంచేశారు. తక్షణమే ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఇది ప్రతీకార పాలన : నిరంజన్‌రెడ్డి

కేసీఆర్ పాలనలో ఎన్నడూ ప్రతిపక్ష ఎమ్మెల్యేలను, కార్యకర్తలను వేధించిన దాఖలాలు లేవని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. దూషించిన, ద్వేషించిన వారిని పట్టించుకోకుండా తెలంగాణ అభివృద్ధి కోసం పనిచేశామని చెప్పారు. ఏడాది కాంగ్రెస్ పాలనలో అంతా విచిత్రంగా ఉన్నదని, రాష్ట్రంలో ప్రతీకార పాలన కొనసాగుతున్నదని మండిపడ్డారు. ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి అరెస్టును ఖండిస్తున్నట్టు చెప్పారు.

దుర్మార్గపు పాలన : కొప్పుల ఈశ్వర్

రాష్ట్రంలో దుర్మార్గ పాలన సాగుతున్నదని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ దుయ్యబట్టారు. పాడి కౌశిక్‌రెడ్డి అరెస్టును ఖండించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తే అరెస్టులా? అని మండిపడ్డారు. తక్షణమే ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

అణచివేతలు ఆపాలి: అనిల్ కూర్మాచలం

అణచివేత ధోరణిని ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఆపాలని రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్ అనిల్ కూర్మాచలం డిమాండ్ చేశారు. ప్రశ్నించిన ఎమ్మెల్యేను అరెస్టు చేయటం అప్రజాస్వామికమని మండిపడ్డారు. ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ పార్టీకి ప్రజలే తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు.

ప్రతీకారమా? : ఎర్రోళ్ల శ్రీనివాస్

రాష్ట్రంలో ఉన్నది ప్రజాస్వామ్యమా? రాజకీయ ప్రతీకారమా? అని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ ప్రశ్నించారు. అణచివేత, కక్ష రాజకీయాలు ఎంతోకాలం సాగవనే విషయాన్ని ప్రభుత్వం గుర్తుంచుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి అరెస్టును ఖండిస్తున్నట్టు చెప్పారు. ఈ అరెస్టులు బీఆర్ఎస్ శ్రేణులను ప్రశ్నించటం ఆపకుండా నిరోధించలేవని స్పష్టంచేశారు.

అరెస్టు అప్రజాస్వామికం : మేడే రాజీవ్‌సాగర్

ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అరెస్టు అప్రజాస్వామికం అని రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్ మేడే రాజీవ్‌సాగర్ పేర్కొన్నారు. రాష్ట్ర సర్కార్ కావాలనే ప్రశ్నించే గొంతులను అణచివేస్తుందన్నారు. పోలీసు కాంగ్రెస్ పార్టీ అడుగులకు మడుగులొత్తుతున్నారని విమర్శించారు. ఎన్ని కేసులు పెట్టినా సరే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించకుండా ఆపమన్నారు.

పూటకో కేసు.. రోజుకో అరెస్టు

- ఇదే కాంగ్రెస్ పాలనా విధానం
- పార్టీ ఫిరాయించిన వారిని ప్రశ్నిస్తే అరెస్టు చేయడం సిగ్గుచేటు?
- అరెస్టులతో బీఆర్ఎస్ ఆత్మస్థైర్యాన్ని దెబ్బ తీయలేరు
- మాజీ మంత్రి కేటీఆర్

హైదరాబాద్, జనవరి 13 (నమస్తే తెలంగాణ): హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని అక్రమంగా అరెస్టుచేయడం అత్యంత దుర్మార్గమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. పూటకో అక్రమ కేసు పెట్టడం, రోజుకో బీఆర్ఎస్ నేతను అరెస్టు చేయడం రేవంత్ సర్కారుకు అలవాటుగా మారిందని దుయ్యబట్టారు. ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి తన చేతకానితనాన్ని కప్పిపుచ్చుకోవడానికే ఇలాంటి దిగజారుడు పనులకు దిగుతున్నారని విమర్శించారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేను వెనకేసుకొచ్చి, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని ఏకపక్షంగా అరెస్టు చేయడం పూర్తిగా అప్రజాస్వామికమని మండిపడ్డారు. రైతురుణమాఫీని ఎగ్గొట్టి, దళితబంధుకు పాతరేసిన కాంగ్రెస్ సర్కారును ప్రశ్నిస్తే సమాధానం చెప్పలేని సీఎం అణచివేత చర్యలకు దిగుతున్నారని మండిపడ్డారు. పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన సీఎం రేవంత్‌రెడ్డిపై చర్య తీసుకోవాల్సిందిపోయి ప్రజల పక్షాన ప్రశ్నించిన కౌశిక్‌రెడ్డిపై కేసులు పెట్టడమే ఇందిరమ్మ రాజ్యమా? అని ప్రశ్నించారు. పోరాటాలే ఊపిరిగా పుట్టిన గులాబీ పార్టీ నేతల ఆత్మస్థయిర్యాన్ని చిల్లర చేష్టలతో కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పటికీ దెబ్బతీయలేదని స్పష్టంచేశారు. కౌశిను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ప్రశాంత తెలంగాణలో అశాంతి చర్యలు : హరీశ్‌రావు

ప్రశాంత తెలంగాణలో అణచివేత, అశాంతిని సృష్టించటమే రేవంత్ సర్కార్ విధానంగా పెట్టుకున్నదని, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అరెస్టు అందులో భాగమేనని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. పాడి కౌశిక్‌రెడ్డి అరెస్టును ఆయన తీవ్రంగా ఖండించారు. 'మీది ఏ పార్టీ అని, పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేను ప్రశ్నించినందుకే కేసులా?' అని ప్రశ్నించారు. కేసీఆర్ పాలనలో పదేండ్లు ప్రశాంతంగా ఉన్న తెలంగాణ, 13 నెలల కాంగ్రెస్ పాలనలో కక్షపూరిత రాజకీయాలకు నిలయంగా మారిందని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రజాప్రతినిధులపై అక్రమంగా కేసులు బనాయించడం, నిలదీస్తే పార్టీ కార్యాలయాలపై దాడులు చేయడం నిత్యకృత్యం కావడం సిగ్గుచేటని మండిపడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన ఎమర్జెన్సీని తలపిస్తున్నదని, కాంగ్రెస్ అణచివేతలు, నిర్బంధాలు, దాడులకు బీఆర్ఎస్ అదరదు బెదరదని, ప్రజాక్షేత్రంలో అడుగడుగునా నిలదీస్తూనే ఉంటామని తేల్చిచెప్పారు

ఒత్తిడికి తలొగ్గి అరెస్టు

ప్రభుత్వ ఒత్తిడికి తలొగ్గి ఎమ్మెల్యేను అరెస్టు చేయటం సరికాదని డీజీపీ జితేందర్‌తో హరీశ్ పేర్కొన్నారు. అరెస్ట్ చేయదగిన కేసు కాకపోయినా, పండుగ వేళ ప్రజా ప్రతినిధిని అక్రమంగా అరెస్ట్ చేయడం సరికాదని డీజీపీతో ఫోన్‌లో చెప్పారు. కక్షసాధింపు చర్యలకు పోలీసులు సహకరించవద్దని సూచించారు.

కౌశిక్‌ను రెచ్చగొట్టింది సంజయే

- బీఆర్ఎసోళ్ల బట్టలు విప్పిస్తానన్నడు
- అందుకే కౌశిక్‌రెడ్డి నిలదీసిండు
- ఎమ్మెల్యేను గుంజుకపోయే అధికారం పోలీసులకు ఎక్కడిది? : గంగుల

కరీంనగర్‌లోని నివాసంలో మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి గంగుల కమలాకర్

కరీంనగర్, జనవరి 13 (నమస్తే తెలంగాణ) : ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే కాంగ్రెస్ ప్రభుత్వంలో అరెస్టులతో భయభ్రాంతులకు గురి చేస్తున్నారని మాజీ మంత్రి గంగుల కమలాకర్ మండిపడ్డారు. సోమవారం ఆయన కరీంనగర్‌లోని తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. కౌశిక్‌రెడ్డిని ముగ్గురు మంత్రుల ముందే పోలీసులు గొరగొర గుంజుకపోవడం శోచనీయమని ఆవేదన వ్యక్తంచేశారు. ఎమ్మెల్యేలు కౌశిక్‌రెడ్డి, సంజయ్ పక్కపక్కనే కూర్చున్నారని, కౌశిక్‌రెడ్డి మాట్లాడి కూర్చున్న తర్వాత సంజ య్ అతన్ని రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారని చెప్పారు. బీఆర్ఎస్ నాయకుల బట్టలు విప్పిస్తానని సంజయ్ రెచ్చగొట్టేలా మాట్లాడినట్లు కౌశిక్ తనతో చెప్పారని వివరించారు. అందుకే కౌశిక్‌రెడ్డి.. సంజయ్ మాట్లా డే ముందు 'నీది ఏ పార్టీ.. ఏ పార్టో చెప్పి మాట్లాడాలె' అని నిలదీసినట్టు తెలిపారు. గొడవ జరిగినప్పుడు మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వేదికపైనే ఉన్నారని, వీరు జోక్యం చేసుకుంటే ఇద్దరినీ అదుపు చేసే అవకాశం ఉండేదని చెప్పారు. ప్రభుత్వ సమావేశంలోకి పోలీసులు ఎలా వచ్చారని, ఒక ఎమ్మెల్యే అని కూ డా చూడకుండా మంత్రుల కళ్లెదుటే గొరగొరా ఎలా గుంజుకెళ్తారని నిలదీశారు. ఒక వేళ తమ అనుమతితోనే పోలీసులు లాక్కెళితే కౌశిక్‌రెడ్డికి ముగ్గురు మంత్రులు క్షమాపణ చెప్పాలన్నారు. 'సీఐ గల్లా పట్టినట్టు కేసు పెట్టాలి' అని ఒక మంత్రి చెప్తున్నట్టు తెలుస్తున్నదని చెప్పారు. కాంగ్రెస్ పాలన ఎమర్జెన్సీ ని తలపిస్తున్నదని విమర్శించారు. ప్రభుత్వం ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా, అరెస్ట్‌లు చేసినా, ప్రతి నాయకున్ని కాపాడుకుంటామని, ప్రశ్నించడం ఆపబోమని స్పష్టంచేశారు.

ఏ సెక్షన్ కింద అరెస్ట్ చేశారు?: బోయినపల్లి

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిని ఎందుకు అరెస్టు చేస్తున్నారో? ఏ సెక్షన్ కింద అదుపులో తీసుకున్నారో? ముం దుగా చెప్పాల్సిన బాధ్యత పోలీసులపై ఉన్నదని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. కారణాలు ముందస్తుగా చెప్పకపోవడం రాజ్యాంగం ప్రకారం తప్పు అని. ఇది చట్టం ముందు నేరమే అవుతుందని చెప్పారు. ఎమ్మెల్యే అకారణ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నట్టు తెలిపారు.

ఇది అప్రజాస్వామికం : ఎల్ రమణ

సమీక్ష సమావేశాల్లో వాదాలు, ప్రతివాదాలు ఉంటాయని, వ